# శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి

## నృత్య నాటిక



నండూరి రామకృష్ణమాచార్య

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

★ నృత్య నాటిక ★

రచయిత

డాక్టర్ నండూరి రామ కృష్ణమాచార్య

ప్రచురణ

శ్రీ భీంసెట్టి శ్రీధర్ : కార్యదర్శి

శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ సేవాసమితి

1-8-76 పి.జీ. రోడ్డు - 35 జవాహరు నగరు,

సికిందరాబాదు - 500 003 ఫోను : 817397

Name of the Book: **Sri Vasavi Kanyaka Parameswary Dance Ballet**

గ్రంథము పేరు : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి నృత్య నాటిక

Name of the Author - **Dr. N.V.R.K.Acharya**

గ్రంథకర్త పేరు - డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య

ప్రథమ ముద్రణ : 1995 First Edition

Copy Rights – Reserved by the Author

Price **Rs. 30/-**

Cover page Design - **Sri Seela Veerraju.**

Publisher : Sri Vasavi Kanyaka Parameswary Seva Samiti
1-8-76, P.G. Road 35,Jawahar Nagar,
Sec' bad - 500 003. Phone : 817397

Printing by : Fontline Graphics, Phone : 660000

దొరకు చోట్లు : Copies can be had from
Dr. N.V.R.K. Acharya
1-8-76 P.G. Road 35 Jawahar Nagar,
Sec' bad - 500 003. Phone : 817397

The Dance Ballet Sri Vasavi Kanyaka Parameswary can be steged only after obtaining written permission from the Author

రచయితకు

## కవితా కర్పూర నీరాజనాలు

హృదయ మమృత సముద్రము;
వదనము కవితా లతాంగికి నర్తన శాల;
సదన మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము;
విశాల వసుధా కుటుంబి - నీ సాటి నీవె.

– శ్రీ శనగన నరసింహస్వామి

ధైర్యము రొమ్ము విచ్చినది,
ధర్మము త్రాసున తూగె; అంచితౌ
దార్యము వ్రేళ్ల పాతుకొనె ;
దక్షత పీఠము వైచి నిల్చె ; సత్
కార్య వినిర్వహమ్ము ఇలు
గట్టి వసించెను - రామ కృష్ణమా
చార్యుల గుండె లోతుల ప్ర
సన్నతలో - మధురానుభూతిలో.

అష్టావధాని, శ్రీ గాదేపల్లి కుక్కుటేశ్వరరావు

అమృత హృదయునకు, సంయమి
సమ సహృదయునకు, ఉదారచరితునకు, మహో
త్తమ గుణ భరితునకు, క్రియా
కమనీయ దయామయునకు, కావ్యమయునకున్.

కానిమ్మోయి కవీంద్ర నీ అతిథి సత్కారమ్ము నీ యింటిలో
వాణీ పాద గలంగలన్మధుర నిక్వాణమ్ముతో ఇందిరా
పాణి ప్రస్ఫుట పద్మ గర్భ మధు సంపాతమ్ముతో, నిత్య క
ల్యాణమ్ముల్ మరి పచ్చ తోరణముగా ఆచార్య మిత్రా ఇకన్.

**శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి**

## "క్రొత్త పాతల మేలి కలయిక"

నండూరి రామ కృష్ణమాచార్య శైలియందును శబ్దజాలము
నందు క్రొత్త పాతల మేలి కలయిక కన్పట్టు చున్నది.

**– తారాతోరణ పీఠిక - కట్టమంచి రామలింగారెడ్డి**

ఎవ్వాని గళములో నవ్వుకొన్నది నంద
నారామ మధుర మందార వల్లి,
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ
భారతీ మంజు మంజీర రవము,
ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను
పర్దాలు లేని సౌహార్ద లక్ష్మి,
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త
గుప్తదానవ్రతప్రాప్త తృప్తి,
అతడు నండూరి వంశ వయః పయోధి
చంద్రముడు; రామ కృష్ణమాచార్య సుకవి;
గద్య పద్య తారాతోరణాద్యనేక
కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

**కరుణశ్రీ : శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి**

నయమార్గ సుప్రసిద్ధా
న్వయ శ్రీ నండూరి వంశ నామార్యునకున్
జయమార్గ సుప్రసిద్ధా
హ్వాయ వేంకట రామ కృష్ణమాచార్యునకున్.

– డాక్టరు ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి

సీ. నెత్తమ్మి రేకుల మెత్తదనము తెచ్చి
పదముల కూర్పుతో - పదిల పరచి,
హరినీలముల జోరు - అంబుదమ్ముల సొరు
భావ సంపద లోన - భద్ర పరచి,
విజ్ఞాన విభవమ్ము - వేదాంత సారమ్ము
ఉక్తి వైచిత్రితో ఒడిసి పట్టి,
సప్త స్వరాలలో - స్పందించు రాగమ్ము
వాక్సుధా లహరికి వాజి సేసి,

తే.గీ తెలుగు పలుకుల సొబగుల తేనె లూర
పారిజాతమ్ము పూయించె - 'ప్రగతి గీత',
రామకృష్ణుని దలపించు రామకృష్ణు
డనఘు డాఢ్యుండు నండూరి కగుత - శుభము.

– ఏరాసు అయ్యపురెడ్డి
న్యాయవాది – మాజీమంత్రి

# రచయిత విన్నపము

I

శ్రీ వాసవి కన్యక - గాంధీ మహాత్మునకు - సుమారు ఎనిమిది శతాబ్దాలకు పూర్వమే చేసిన ఆత్మబలిదానము - అపర భోధి సత్త్వుడైన శ్రీ పొట్టి శ్రీరాములుకు పూర్వరంగము నిర్వహించిన సత్యాగ్రహిణి. యావత్ ప్రపంచము త్యాగమయి ఆమె చరితకు పులకాంకుర ప్రకరాలలో కర్పూర నీరాజనం సమర్పించి జేజేలు పలికింది.

ఈ నృత్య నాటిక - శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్రకు అద్దం పట్టే ఆరాధన.

II

పెనుగొండ - పశ్చిమ గోదావరి వశిష్ఠ. గౌతమీ తీరస్థ పట్టణం శ్రీ వాసవి కన్యక ఆవాస స్థలం - తదుపరి పుణ్యక్షేత్రంగా ఆర్య వైశ్యులకు ఆధ్యాత్మిక సాంస్కృతిక రాజధానిగా విలసిల్లింది. అక్కడ శ్రీ వాసవి కన్యక ఆలయం వెలసింది.

III

నేను గాంధీ యుగంలో పుట్టి పెరిగిన కవిని.

"శాంతి సమర మందు - స్వాతంత్ర్య యజ్ఞాన
సగము కాలినట్టి సమిధ నేను"

ఆంగ్లంలో గాంధీయుగం అనే గ్రంథం వ్రాశాను. నా బ్రదుకు మలిసంజ కెంజాయలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర - నృత్య నాటిక సమకూర్చాను. "సత్యాగ్రహం" - అనే త్యాగమయమైన శాంతి ఆయుధమును ప్రపంచానికి అందించినది భారతదేశ సంస్కృతి. ప్రపంచ చరిత్రలో - పేర్కొనదగిన ప్రప్రథమ సత్యాగ్రహిణి చరిత్రయే ఈ నృత్య నాటిక. ఆధునిక నాగరికతలో నృత్య నాటిక గొప్ప సందేశ సాధనం.

## IV

నా జీవితయాత్రలో విద్యార్థి దశలో నిర్వ్యాజ ప్రేమతో నాకు ఉపకృతులు చేసిన వారు ఆర్యవైశ్య వంశ సంజాతులు కీర్తిశేషుడు శ్రీ క్రొత్తమాసు వెంకటరత్నం అయ్యన్న, వస్త్ర వ్యాపారి శ్రీ గుడిమెట్ల వేంకట శేషగిరిరావు. వేదాంతులు భగవంతుని - "హే నిర్హేతుక జాయమాన కరుణా" అని సంబోధిస్తారు. నిష్కారణమైన ప్రేమలో దివ్యత్వం తాలుకాడుతుంది. నా యౌవన దశలో నన్ను ఆ విధంగా ఆదరించిన వారు తుమ్మలపల్లి వీరభద్రరావు గారు. ఒకనాడు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు. తండ్రికి తగిన తనయుడు శ్రీ తుమ్మలపల్లి వేంకటేశ్వరరావు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అయ్యారు తదుపరి. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి గారు సహజకవి- నాకు చిరకాలం ఆప్తమిత్రుడు. పెనుగొండ వాస్తవ్యులు శ్రీ నూలి సోమరాజుగారు నేను ఆంగ్లంలో వ్రాసిన Wisdom of the world ముద్రణకు ద్రవ్య సహాయం చేసి అనేక విధాల నాకు తోడ్పడిన వారు.

నేడు - శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి - నృత్య నాటిక - ముద్రించటానికి ముందుకు వచ్చిన మిత్రుడు ఆర్యవైశ్య శిఖామణి -

శ్రీ భీంసెట్టి శ్రీధర్ శ్రేష్ఠిగారు - సహృదయులు. సంపన్నతను మించిన ఔదార్యం చూపించారు.

ఈ గ్రంథం - ఆవిష్కరణ మహోత్సవం పెనుగొండ క్షేత్రంలో జరిపేందుకు సూత్రధారి పాత్ర నిర్వహించటానికి అంగీకరించిన పెనుగొండ పౌరులు శ్రీ నూలి సోమరాజుగారికి నా ధన్యవాదాలు.

## V

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి - నృత్య నాటికకు ముఖచిత్రం చేకూర్చిన సుప్రసిద్ధ చిత్రకారులు

శ్రీ శీలావీర్రాజు గారికి నా సుహృదభినందనలు.

వీరరాజు నందు - విశ్వతో ముఖ దీప్తి
కానుపించు లలిత కళల యందు;
అంతెగాక - అతని అర్ధాంగి - కవయిత్రి;
అతని ఇల్లు - ప్రతిభ కాటపట్టు.

VI

నా ఆప్తమిత్రుడు - సత్కవీశ్వరుడు - శాంతిశ్రీ జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి గారు "త్యాగమయి" అనే పేరిట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్ర పద్య కావ్యంగా వ్రాశారు.

వారు వ్రాసిన ప్రార్థన, నా యీకావ్యంలో చేర్చాను. అట్లే ఆ కావ్యానికి శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి గారు వ్రాసిన పీఠిక ఘంటానాదం చిరుమార్పులతో సంగ్రహించి చేర్చాను.

VII

ఈ నృత్య నాటిక - తెలుగు నేల నాలుగు చెరగుల ప్రదర్శించాలనీ - ఆడియో వీడియో క్యాసెట్లు నిర్మించాలనీ నా సంకల్పం.

ఆర్య వైశ్య వరులు - ఆంధ్ర దేశము నందు
దానకర్ణు లయిన ధర్మపరులు;
వాసవీ కుమారి - వారి దేవత యయ్యె;
త్యాగ యజ్ఞ యోగ ధన్య చరిత.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

నృత్య నాటిక

# నేపథ్య నీరాజనం

I

నృత్య సరస్వతీ కటక నిక్వణముల్ ప్రకటించుకొంచు - సా
హిత్య సరస్వతీ హృదయ మిచ్చుచు గాన సరస్వతిం బలెన్
సత్య పదార్థ కీర్తనము సల్పుచు మత్ కవితా సరస్వతీ
నిత్యత చాలు - స్వర్గమును నీరస మీ రస సిద్ధి ముంగటన్.

**- శ్రీ మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి కవి**

పంచవటి కావ్యం అవతారికలోని పై పద్యం "నృత్యనాటిక"లకు హృదయంగమంగా అన్వయించగలదు. కవిత్వం - గానం - నాట్య కళలకు "నృత్యనాటిక" పరిణామ రమణీయమైన 'ముయ్యేల గుట్ట'. అంతేగాక చతుర్విధాభినయ వైవిధ్య సమ్మేళనం - జంత్ర బృందవాద్య నాద సమన్వితం చిత్ర శిల్ప కళా విన్యాస సరశోభితం అయిన నృత్య నాటిక - సహృదయులకు సద్యోరస ప్రతీతి కల్పించి "అహో! మనోనేత్ర నిర్వాణం" అనిపిస్తుంది. నృత్య నాటికలో ఆలోచనామృతమైన ఆపాత మధుర ప్రక్రియలో - సకారత్రయ సమ్మేళనం - సౌకుమార్యం - సారళ్యం - సౌందర్యం - విరాట్ స్వరూపంతో సాక్షాత్కరిస్తుంది. లయ విన్యాసం - శ్రుతి పరిపక్వత గంగాయమునల వలె నృత్య నాటికలో సంగమింపగలవు. "కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు ఆలంకారికులు ఏనాడో. ఈనాడు ఆ శ్లోకాన్ని యథోచితంగా పూరించవచ్చు.

"కావ్యేషు నాటకం రమ్యం
తథాపి నృత్య నాటికా

సంగీత సాహితీ నాట్య
త్రివేణీ సంగమం యథా''

'అవస్థానుకృతిర్నాట్యం' మాత్రమే గాక - నృత్య విశేషాలు అన్నీ రాగ తాళ వైవిధ్య విన్యాసాలతో నృత్య నాటికలో పరాకాష్ఠ చెంది స్వయం వ్యక్తం కాగలవు.

II

విషాదాంత రూపకాలు ప్రాచీన భారతీయ సాహిత్యంలో మృగ్యాలు.

గ్రీకు వాఙ్మయమ్ము శోక నాటకములో
శిల్ప శిఖర పంక్తి సృష్టి చేసె;
అమర చేసె - భావితాంతఃకరణ వృత్తి
జగతి యెల్ల యెడల సహృదయులకు.

గ్రీకులు ఆరాధించిన ట్రాజెడీలలోని విషాద మరణ పూరితములైన ఇతివృత్తాలను మించినది ఆత్మ బలి దాన సమర్పణ సమన్వితమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ గాథ.

ఆంధ్ర సారస్వత చరిత్రలో ఆధునిక యుగంలో వేగు చుక్కగా వెలసిన శ్రీ గురజాడ అప్పారావుగారు ఈ కన్నీటి గాథను ముత్యాల సరాలలో గుది గుచ్చారు. అన్ని ఇతివృత్తాలూ నృత్య నాటికకునప్పవు. సకారత్రయం ముప్పిరిగొన్న కథా వస్తువు మాత్రమే నృత్య నాటికకు సరిపోతుంది. సంస్కృతంలో ఆలంకారికులు - నాటకం లోని ఇతివృత్తం - ప్రఖ్యాత మైనది కావాలని నిర్దేశించారు.

**"ఏకో రసః కరుణ ఏవ" - అన్నాడు మహాకవి భవభూతి**

"కవిత అనిన గుండె కరగింప వలె సదా
కరుణ రసము - వెల్లివిరియ చేసి;
కానుపించు - 'కవిత' కన్నీటి జల్లులో
ఇంపుగొలుపు - గొప్ప ఇంద్ర ధనువు"

యుగ యుగాంతరాలుగా సహృదయుల గుండెలు దున్ని - లే వెలుగుల పంటలు పండించిన పరమ పవిత్ర చరిత్ర శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిది.

III

ఆంధ్రుల నాట్య విద్య సర్వతోముఖ సమగ్రమైనట్టిది. చతుర్విధాభినయములు ప్రౌఢ పరిపక్వ నిర్భర పరిణతిలో కన్పిస్తాయి. కూచిపూడి నాట్య కళలో విశ్వవిఖ్యాతిని ఆర్జించిన భరతనాట్యం యథోచితమైన మార్పులు కూర్పులతో పునాదిగా ఏర్పడి ఉంది. 'కూచిపూడిలో కుక్క మొరిగినా సంగీతమే' అన్న సామెత తెలుగులో అవతరించింది. "పదం"- తెలుగు మేలి ముసుగులో ప్రత్యేకత సంతరించుకున్నది. పరిహాస రసికులు

శ్రావ్యమైన గొప్ప సంగీత కళ యౌను
కూచిపూడి యందు కుక్క మొరుగ:
దున్నపోతు బెదరి - తోక నాడించుచో
నవ రస రుచిర మగు - నాట్య మగును.

అని చమత్కరించవచ్చు. కూచిపూడి నాట్య విద్యకు పర్యాయ పదమైనది. అది వెనుకటి చరిత్ర. సిద్ధేంద్ర యోగి వర్యునితో నాట్య కళ ఆగిపోరాదు.

క్రుళ్లిపోయి - పసరు కోనేరు కారాదు
నవ్య యుగము నందు - నాట్య విద్య;
కూర్చుకొనుట మేలు - క్రొంగ్రొత్త వృత్తముల్
తర తరాల ప్రజలు తలల నూప.

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి గాథలో ఆదర్శనృత్య నాటికకు అవసరమైన హంగులు అన్నీ ఉన్నాయి. సాంగోపాంగ సమగ్ర సుందరమైన నృత్యనాటికకు

అమరే ఇతివృత్తం ఇది. ఇది ఏదో పుక్కిటి పురాణగాథ కాదు. కేవల కల్పనాకథ కాదు. ఆంధ్రదేశంలో జరిగిన కథ. త్యాగమయి అమృత చరిత్ర. ప్రపంచ చరిత్రలో - శ్రీ వాసవి కన్యక- ప్రథమ సత్యాగ్రహవ్రత పారీణ. అహింసా సిద్ధాంత చరిత్రలో అనుష్ఠాన వేదాంతిని. మహాత్ముడు గాంధీగారికి అపరబోధిసత్వుడు పొట్టి శ్రీరాములు గారికి పూర్వరంగ ప్రవర్తకురాలైన సూత్రధారిణి. యుగ యుగాంతరాలుగా ఆ త్యాగమయి ఆత్మార్పణం తెలుగు గుండెలలో ప్రసరించిన ప్రభావం వర్ణనాతీతం.

## IV

సంప్రదాయ నాట్య కళపై ఆధునికులు చేసే విమర్శ గమనింపదగినట్టిది. ఇంత వరకూ నృత్య విద్య ఉపాసించిన ఏకైక రసం - శృంగారం. పచ్చి పచ్చి పిచ్చి పిచ్చి శృంగారం. నవీనులు - నాట్యకళ నవ రస రుచిరంగా ఉండాలి అంటారు.

అవతరించుగాక - నవ నాట్య కవనముల్
భావ తాళ రాగ భంగిమములు;
నాట్య విద్య వరలు - నది వోలె ప్రవహింప
మురికి గుంట కాక - చెరువు గాక.

ఈ నృత్య నాటిక - శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిలో నవ్యత్వం ఉంది. దివ్యత్వం ఉంది. ఆదర్శ ధ్రువతారకా రోచిస్సులు ఇతివృత్తంలో మిరుమిట్లు కల్పిస్తూ ఉన్నాయి. పిల్లలు పెద్దలు యావత్ కుటుంబం చూచి ఆనందించదగిన ఇతిహాస లాస్యం ఇది.

# నృత్య నాటిక

కావ్యేషు నాటకం రమ్యం
తత్రాపి నృత్య నాటికా।
జంత్ర వాద్య సమారోహా
రాగ తాళ లయాన్వితా ॥

II

వాణి వీణ - కృష్ణ వేణు నిక్వాణముల్,
ఉరిమి నాట్య మాడు మెరపు తీగె,
శివుని డమరు కమ్మ - శింజినీ లయ జతుల్,
కలిసి - నృత్య నాటకమ్ము - పుట్టె.

III

కవిత - మృదు మనోజ్ఞ గాత్ర సంగీతమ్ము,
జంత్ర వాద్య బృంద సంగమమ్ము,
నృత్య నాటకమ్ము - నేత్ర, నిర్వాణమ్ము!!
రస విలాస లాస్య రంగభూమి.

IV

నృత్త నాటకమ్ము - ఇతి వృత్త సుభగమ్ము,
కోమల మృదు భావ గుంఫితమ్ము;
నింగి నేల కలుపు - సంగీత రసకళా
తరళ విశ్వరూప దర్శనమ్ము.

V

రాగ తాళ లయల - ప్రస్తార యజ్ఞమ్ము,
అభినయములు నాల్గు కాట పట్టు
మధుర కవవమునకు - మాణిక్య మకుటమ్ము
నృత్య నాటకమున కేది సాటి?

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి
## కర్పూర హారతి

వైశ్య ఋషులలో సమాధి పేరెన్నిక గన్న ఋషి అయన కన్య పేరు కీర్తికన్య. ఆమె జగదేక సుందరి. పరాశక్తి భక్తురాలు. బ్రహ్మచారిణిగా భక్తియోగంలో జీవనం పావనం చేసుకొంటూవుంది.

ఒక గంధర్వుడు చిత్రకంఠుడు ఈమెను మోహించి వెంటాడాడు. కీర్తికన్య తిరస్కరించింది. జనకుడు బంధువులు చిత్ర కంఠుని ప్రవర్తనను అసహ్యించుకొన్నారు. గంధర్వుడు కోపించి 'మీరు అగ్నిలో పడి మరణింతురుగాక' అని శపించాడు. వీరు 'నీవును ఆ అగ్నిగుండము చెంతనే తలపగిలి మరణింతు'వని ప్రతిశాపమిచ్చారు.

మరు జన్మలో కీర్తికన్య వాసవిగాను చిత్రకంఠుడు చోడ విష్ణువర్ధనుడుగా పుట్టినట్లు పౌరాణిక గాధ.

విశులు మూలపురుషులున్న వారు గాన వైశ్యులనియు గోరక్షణ, గోమత నిర్వహణలో ప్రీతి గలవారు కనుక గోమతులని కామతేశ్వరి భక్తులు కనుక కామతులు గోమతులు అను పేర్లు పొంది జనవ్యవహారంలో కోమటులై వర్ధిల్లినారు.

గోరక్షణ, వ్యవసాయం, వాణిజ్యం, అధ్యయనం దానం వీరి షట్కర్మలు, పరాశక్తి వీరి ఇష్టదేవత.

కాలక్రమంగా వీరి వంశములు విస్తరిల్లి పంజాబు గుజరాతు మహారాష్ట్ర మొదలైన ప్రదేశాలలోను గోగర్భం, గోకర్ణం, గౌడదేశం, బర్మాలోని 'పతకోయ్' అంటే పెద్ద గొండ ఆయా ప్రదేశాలలో స్థిరపడినారు. గౌరదేశవాసులనీ గౌరవం గలవారనీ, గౌరులు, గవరులు అనే పేర్లు కూడ వచ్చాయి. బీహారు వాసులకు బేహరులని వాడుకవచ్చింది. సాధువర్తనులు కనుక సాధుకారులు సాహుకార్లుగా పిలువబడినారు. ఆర్యులు ఆర్యులుగా వ్యవహారము.

సమాధి ఋషిబంధువులు నూట రెండు గోత్రాల వారు తదితరులు 612 గోత్రాలవారు కలిసి 714 గోత్రాల ఆర్యవైశ్య సముదాయం ఆంధ్రదేశం వచ్చింది. 18 నగరాలు నిర్మించుకొని వశిష్ఠ గోదావరీ తీరంలోని పెనుగొండను రాజధానిగా చేసుకొని గణతంత్ర విధానంలో రాజ్యపాలన సాగించింది.

'మహాగిరి' ఆర్యవైశ్యుల తొలి నివాసం కనుక వీరి ముఖ్యపట్టణం పెనుగొండ అని తెలుగు పేరు పెట్టుకొన్నారు. 18 నగరాధిపతులు నగరస్వాములు. పెనుగొండ వైశ్యప్రభువు అధ్యక్షుడు. సభానిర్ణయానుసారం రాజ్యపరిపాలన జరుగుతుండేది. సంఘంలో శ్రేష్ఠత బొంది శ్రేష్ఠి సెట్టి అయినారు.

భాస్కరాచార్యుడు వైశ్యగురువై భాస్కరాచార్య పీఠం పేర ధర్మపీఠం ఏర్పాటు చేసి తరతరాలుగా కర్తవ్య బోధ చేసే పద్ధతి ప్రకటించారు.

కాల వైపరీత్యం వలన వైశ్య సామ్రాజ్యం రాజమహేంద్ర సార్వభౌమునికి సామంత రాజ్యమైంది.

కల్హారుడు సామంతరాజు. వారి పుత్రుడు కుసుమశ్రేష్ఠి. ఇతడు తండ్రి తరువాత సామంతరాజై రాజ్యం ఏలుతున్నాడు. కుసుమ శ్రేష్ఠి భార్య కుసుమాంబ. వీరు అనుకూలదంపతులు. శ్రీ భాస్కరాచార్య పీఠాధిపతి ఆదేశానుసారం పుత్రకామేష్టి చేసి సంతానవంతులైనారు. ఆ సంతానమే విరూపాక్షుడు శ్రీవాసవి.

వైశ్య వంశాలలో కొందరు బాలికలు జగదంబాసేవాంకితలై జీవనము గడిపి గౌరవ పదము లందుట పరిపాటి. వారిని గౌరవ గౌర లేక గవర బాలికలు అందురు. కొందరు బాలురు నగర పరిరక్షణలో నిమగ్నులై యుండేవారు. వారే బాలనగరులు. గౌరబాలికలకు బాల నగరులు వివాహయోగ్యులు. గౌరబాలికలకు బాలనగరులకు సంఘంలో మిక్కిలి గౌరవం వుండేది. శ్రీవాసవి గౌరబాలిక దీక్ష పొందింది. బాలనగరుడుగా విరూపాక్షుడు శత్రుదుర్నిరీక్షుడై ప్రకాశిస్తున్నాడు.

రాజమహేంద్రవరంలో చాళుక్య విష్ణువర్ధనుల కాలం చెల్లిపోయి చోడ విష్ణువర్ధనుడు రాజ్యానికి వచ్చాడు, ఈతడు భోగలాలసుడు.

ఒకసారి చక్రవర్తి విజయయాత్ర చేసుకుంటూ పెనుగొండ వచ్చాడు. వచ్చిన చక్రవర్తికి వైశ్య ప్రభువులు తమ కన్యకామణులచే హారతు లిప్పించి గౌరవ మర్యాదలతో ఆహ్వానించి విడిది చేయించారు. చక్రవర్తి పట్టణంలోని విద్యాలయ దేవాలయాదులు దర్శించి అభివృద్ధికి తృప్తి చెందాడు. ఆ సందర్భంలో శ్రీవాసవి చక్రవర్తి కంటపడింది. రాజుమనస్సు వాసవిపైకి పోయింది. నర్మ సచివులు కుసుమశ్రేష్ఠికి వర్తమానము పంపి వివాహ విషయ ప్రస్తావన చేశారు. శ్రేష్ఠి వైశ్యకులాచారమును కన్యక భావములు వివరించి 'బాలిక శివాంకిత. భక్తురాలు. పెండ్లిపై కోరిక లేనిది. పరదేతారాధనాశీల' అని వివరించాడు.

రాజు క్రుద్ధుడైనాడు. కామాంధుడై తనకోర్కె నెరవేర్చనిచో పట్టణాన్ని భస్మీపటలం చేస్తానన్నాడు. మంత్రులు మాటలతో రాజుని ప్రస్తుతానికి రాజధానికి పంపగలిగారు. కుసుమశ్రేష్ఠి నగరస్వాముల రావించి సభ చేసి సభాముఖంగా నిర్ణయం తీసుకున్నాడు. భాస్కరాచార్య ఉపదేశప్రకారం రాయబారాలు నడిచాయి. కాని అన్ని ప్రయత్నములు వ్యర్థమైనాయి. సభ్యులలో అభిప్రాయ భేదాలు వ్యక్తమైనాయి. వాసవి సత్యాహింసా విధానంలో ఆత్మాహుతికి నిర్ణయించుకొన్నది. రాజు దండెత్తి రాబోతున్నాడు. ఇంతలో పట్టణంలోని కొందరు రాజును మాయమాటలతో ఆపారు. మాయదార్లు - మైలార్లుగా - నేటికీ వైశ్యుల ఆదరణకు పాత్రులై జీవిస్తున్నా

పెనుగొండలో శ్రీ వాసవి ఆత్మాహుతి జరిగింది. ఆ తల్లి పరమేశ్వరి లీనమైంది. శ్రీ వాసవితో 102 గోత్రాల ప్రధాన దంపతులు ఆత్మత్యాగం చేసి పుణ్యాలోకం పొందారు. 102 గోత్రాలవారిలో లాభగుప్తుడు నిస్సంతు. అగ్నిప్రవేశం చేశాడు. అతని వంశం నిర్వంశమై నందుకు చింతిల్లి అతని పేరు

చిరస్మరణీయమై యుండుటకు వైశ్యులు తమ వర్తకములో తూకాలలో కొలతలలో 'లాభం' అని ముందుగా ఉచ్ఛరిస్తారు. మిగిలిన 612 గోత్రాలవారు ధర్మవిరుద్ధంగా ప్రవర్తించి చక్రవర్తి మెప్పుకై వీరితో సంబంధాలు త్రెంచుకొన్నారు. వీరు ఆర్యవైశ్యులుగా పిలువబడుట లేదు.

చక్రవర్తి పరిస్థితి తెలిసికొని చివరకు పశ్చాత్తప్తుడై తలపగిలి చనిపోయినాడు. యువరాజు న్యాయ సమ్మతంగా విరూపాక్షుని పెనుగొండ సామంతరాజుగా నియమించి సఖ్యత నెరపి మంచి కీర్తి సంపాదించుకున్నాడు. ఇది పురాణ ఇతిహాసమువలన తెలియవచ్చిన స్థూలమైన గాధ.

—శాంతి శ్రీ

శ్రీ జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి

About the Author **Dr. N.V.R. KRISHNAMACHARYA**

Extract from "Contemporary Indian Literature" published by the Sahitya Akademi-New Delhi.

## THE NEO-CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the returnto classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like **NANDURI KRISHNAMACHARYULU,** Jandhyala Papayya Sastri and G. Jashua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the postwar world an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. **KRISHNAMACHARYULU** and his fellow poets claim that they are effecting this reconciliation. The neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి
## ఝుంటానాదం

కళోద్ధారక

**శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి**

తన విన్నపాన్ని, సావధానంగా ఆలకించమని తన ప్రార్ధనకు ముందు దైవానికి చేసే హెచ్చరిక ఝుంటానాదం. కాలాతిక్రమణం వలదనీ కర్తవ్యోన్ముఖుడవు కమ్మనీ హెచ్చరించేవి ఝుంటానాదాలు. కర్తవ్య నిర్వాహణకు సమయసూచిక ఝుంటానాదం. ఆర్యవైశ్యులకు సముచితమైన ఝుంటానాద మీ కావ్యం.

ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ చరిత్ర పవిత్రమైన ఘంటానాదమై ప్రతి హృదయంలోనూ నినాదించాలనీ శ్రీ వాసవీమాతను హృదయపీఠముపై అధివసింపజేసుకొని ఉత్తేజితులై కర్తవ్యోన్ముఖులై సత్సంప్రదాయాల ననుష్ఠిస్తూ ఆత్మోద్దీప్తినీ ఆత్మభిమానాన్ని ఆత్మగౌరవాన్నీ ఇనుమడింప చేసుకుని ధార్మిక జీవనంలో సమాజసేవానిరతిలో తమ కర్తవ్యాన్ని ఏమరకుందురుగాక యని కృతికర్త సత్సంకల్పం. అది యీ కావ్యంవలన సిద్ధింపగలదని ఆశిస్తున్నాను.

మధురమై సరళమై సుందరమై అర్ధవంతమై హృదయాన్ని స్పృశించి ఉత్తేజింపజేసే కావ్యం వ్రాయటం అంత సులభంకాదు. అందుకు పూర్వజన్మ సుకృతం దైవప్రేరణ చిత్తశుద్ధి అత్యంతాశ్యకం అవి అన్నీ సంతరించుకున్న శ్రీ శాంతిశ్రీ గారి లేఖిని అమృతం చిందించింది రసతర్పణం చేసింది. అనుపదం సుందరమై మధురమైన అంత్యప్రాసలతో సజీవములైన జాతీయాలతో రమణీయమైన వర్ణనలతో కమనీయమై శ్రవణశుభగమై రసజ్ఞుల ఆదరణకు పాత్రమై యీ కావ్యం సర్వజనా మోదము నందగలదని ఆశిస్తున్నాను.

పరమ పవిత్రమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దివ్యచరిత్రము నెందరో ద్విపదగా పురాణంగా కావ్యంగా ఉద్దండ పండితులు బహుళంగా బహురీతుల వెలయించారు. మహనీయమైన ప్రబోధాత్మకమైన చరిత్ర చర్విత చర్వణమైననూ రుచికరమై మనోమోహనమై ఆనందోత్సేకమును కలిగించుటేగాక ధార్మికగుణ సంపత్తినీ పవిత్రమైన

ఆచరణనూ ఆత్మోద్దీప్తిని అనుక్షణం పెంపొందించి దివ్యత్వాన్ని ప్రతిష్ఠిస్తుంది. ధార్మికమైన, దీక్షాప్రపత్తిని పెంపొందించేది శ్రీ వాసవీమాత చరిత్ర. అపూర్వము అపురూపమైన వినూత్నరీతిని సంతరించుకున్నది.

వేయి సంవత్సరములకు పూర్వము ప్రపంచంలో ఏ సత్యాగ్రహియు ధర్మాన్ని ప్రతిష్ఠించుటకు అనిదంపూర్వమై ఎవరూ సాహసించని అసాధారణమైనది ఆత్మార్పణం. పాశవికమైన పశుబలాన్నీ దౌష్ట్యాన్నీ ఆత్మబలంతో ప్రతిఘటించి నిర్జించినది సత్యాగ్రహం. ప్రపంచంలో ప్రథమ సత్యాగ్రహిణి శ్రీ వాసవి. ఈ విశుద్ధ చరిత్ర సర్వజనులకు అవశ్య పఠనీయం-ఆచణయోగ్యం.

వ్రాసితి ఘంటానాదము
వ్రాసితి భవబంధమెల్ల వైదొలుగుటకై
వ్రాసితి వాసవి కృపకై
వాసింగను కావ్య మిద్ది వసుధన్ సతమున్.

జైహింద్.

**తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి**

**"ఘంటానాదం"**

శాంతిశ్రీ రచించిన "వాసవి కన్యక" కావ్య పీఠికనుండి సంగ్రహింప బడినది.

ముఖ చిత్రము -

1. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

క్రింది వలయము -

కన్యకా పరమేశ్వరి

ఆత్మా హుతిచిత్రము

మలి అట్ట -

1. పెనుగొండ క్షేత్రము దేవాలయం

క్రింది వలయము శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి - విగ్రహం.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ సేవా సమితి

కార్యదర్శి : ఈ గ్రంథ ముద్రాపకుడు

శ్రీశ్రీశ్రీ భీంసెట్టి శ్రీధర్ గారికి

## ఆశీర్వాభినందనలు

ఉ. నల్లని వాడు - పద్మనయ
నంబుల వాడు - కళాభిమాని - జా
బిల్లి వెలుంగు వెల్లికల
భీంసెటి శ్రీధరు పేరుతోడ - రం
జిల్లుచు - కన్నె ఈశ్వరికి
సేవలు చేయుచు - కార్యదర్శియై
పెల్లుగ - సర్వసంపదల
పేర్మి వహించు - ఇతోధికమ్ముగన్

- నందూరి రామ కృష్ణమాచార్య
వాసవి కన్యకా పరమేశ్వరి
నృత్య నాటికా రచయిత.

# శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి
# ఆరాధన స్తవం

శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ!
జ్యోతిర్మయీ! వాఙ్మయీ!
నిత్యానందమయీ! నిరంజనమయీ!
కరుణామయీ! చిన్మయీ!
తత్త్వాతీతమయీ! పరాత్పరమయీ!
మాయామయీ! శ్రీ మయీ!
సర్వేశ్వరమయీ! సదా శివమయీ!
సర్వతేజోమయీ! వాసవీ॥

I

శ్లో: ధ్యాయేత్ శ్రీ వాసవీ దేవీం బ్రహ్మ విష్ణు శివాత్మికాం
పరాశక్తిం జగద్ ధాత్రీం కన్యకా పరమేశ్వరీం.

II

శ్లో: సదా సంశ్రిత మందారాం సచ్చిదానంద సుందరీం
శ్రీ జగన్మాతరం వందే కన్యకా పరమేశ్వరీం.

## భూమికలు

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి - చెలికత్తెలు - కన్యక తల్లిదండ్రులు - (మూకాభినయం) - భాస్కరాచార్య గురువు - రాజు - సేనాపతి - వర్తకశ్రేష్ఠులు - వందిమాగధులు - రంగ పరికరాలు - "జడ కోలాటం" - చితి. సరస్వతీ నాట్యం - బ్రహ్మ - విష్ణు - మహేశ్వరుల నృత్యములు

# శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ
# నృత్య నాటిక
## నాంది

తాళం : ఝంపి　　　　　　　　　　　　　　రాగ మాలిక

I

వందేసుందరీం వాసవీం కన్యకాం!
పరమేశ్వరీం దాస్య బంధాభిమన్యుకాం!
స్వచ్ఛంద బలిదాన శాశ్వత యశస్వినీం!
మృదు మధుర మంజుల మనోహర మనస్వినీం.

II

మందార మకరంద మాధురీ స్యందినీం!
వందారు భక్తజన సందోహ నందినీం!
సచ్చిదానంద సంస్కార నిష్యందినీం!
ఆర్తజనత్రాణ కీర్తి హరిచందనీం.

III

నందన వనీతీర మందాకినీ ఝరీ
మందానిల సుషమా ప్రభా భాసురీం!
కుందేందు తుహిన నిభ కోమలాదర్శనీం!
మందహాస మనోజ్ఞ మండన సుదర్శనీం.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

# ప్రార్థనాంజలి

శ్రీ మణి శైల రాజ సిత శృంగముపై సుర కల్ప వాటికా
స్తోమము మధ్య శైలసుత - తోయధి పుత్రి - విధాతృపత్ని విం
జామర వీవ, దేవ ముని సంఘము కొల్వ, సువర్ణ పీఠిపై
సోమ శతాధికప్రభల శోభిలు తల్లిని లో తలంచెదన్.

శ్రీకరమైన కాంతి ప్రసరించు శుభోదయ పుణ్యవేళ ప
ద్మాకర మందు క్రొత్త అరుణాబ్జముపై కొలువుండి దిక్కులన్
శ్రీ కరుణా కటాక్ష సరసీరుహరోచులు పర్వఁజేసి ము
ల్లోకము లేలు తల్లి! మృదులోలమనస్క నమస్కరించెదన్.

ఓం కారస్వర మంగళాచరణ మంత్రోద్యన్మహా వాహినీ!
ఐంకారోదిత సామగానరస సత్యానంద చిద్రూపిణీ!
హ్రీంకారోజ్వల బీజసంపుట లసత్ ప్రేమైకసంచారిణీ!
శ్రీంకారోన్నత దేవతా! సురనుతా! శ్రీ వేద సంసేవితా!

- శాంతిశ్రీ

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

## నృత్య నాటిక

ప్రవేశం: సరస్వతి - లక్ష్మి - పార్వతి: సరస్వతీ నృత్యం

శ్లో॥ జ్ఞానానందమయీ వాణీ - జితైశ్వర్యాధికారిణీ!
కచ్ఛపీ నిక్వణత్ పాణీ - స్వేచ్ఛాంబర విహారిణీ!!

ఆది తాళం రాగం

పలుకుల చెలి అందెల కల గలగల
పలు గుండెల లోపల - నినదించుత!
లాస్య సరస్వతి లావణ్యములో
తలపుల జిగిబిగి జిలుగులు వెలుగుత! ॥పలుకుల చెలి॥

నర్తకి శారద నయనాంచలములు
స్థిర విద్యుద్ రోచులు చిమ్ముచు
మానవ మనసుల మధురిమ లొలుకుచు!
పోకార్చుత వేచీకటి నీడలు! ॥పలుకుల చెలి॥

వాణీ వీణా క్వాణ నినాదము
విశ్వ కల్యాణ వీచీ రుచులై
శాంతి సామబుక్ సంక్రాంతి శ్రుతి
ఉల్లము లందున ఊయెల లూపుత! ॥పలుకుల చెలి॥

సుందరానంద కంద వాక్సతీ
మధుర మనోహర మందహాసములు
తరళశరజ్జ్యోత్స్నా తరంగములు
నింగి నేల ఉప్పొంగగ జేయుత ॥పలుకుల చెలి॥

మంజు భారతీ మంజుల శింజిత
మధురిమ లలముత మానవ హృదిలో!
సంగీత సరస్వతి - రంగస్థలి
నవరస భంగుల నాట్యము చేయుత! ॥పలుకుల చెలి॥

**కన్యక + చెలికత్తెలు**

తాళం : రూపకం రాగం

I

నమో నమో! నాలుగు మొగముల దేవర!
నమో నమో! విశ్వశిల్పి! నమో నమో! సృష్టికర్త!
నమో!నమో! వేద నాద ముఖరిత దిగ్ దిగంతరా నమో నమో!

II

నమో నమో నారాయణ! జగద్ రక్షణ పరాయణ!
విశ్వకళా త్రాణన చణ! నమో నమో జిష్ణుభావ - విష్ణుదేవ నమో నమో!

III

నమో నమో! నటరాజా! సంధ్యా పాటల తేజా!
హాలాహల భక్షా - నిటలాక్షా - నమో నమో॥

ఆ.వె.॥ ఎవని కాంగికమ్ము - భువన సర్వసమ్ము?
వాచికమ్ము సర్వవాఙ్మయమ్ము??
అభ్ర చంద్ర తార లాహార్య మెవనికొ?
అట్టి సాత్వికు శివు నభినుతింతు.

(ప్రవేశం భాస్కరాచార్య: కన్యకలు గురువుపై పుష్పవృష్టి కురిపిస్తారు.)

## కన్యక + చెలికత్తెలు

శ్లో॥ గురుర్ బ్రహ్మ - గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరబ్రహ్మ - తస్మైశ్రీ గురవే నమః

రాగం తాళం- ఝంపి

ఆచార్య పాదులకు అభివాదము లివిగో!
భాస్కరాచార్యులకు భక్త్యంజలి ఇదిగో!
తొలి ఉషస్సులలో - కనులు విచ్చినవి విరులు
తేటి ముట్టక ముందు తెచ్చాము భక్తితో ॥ఆచార్య॥

ప్రత్యూష పవనాంకురములలో ప్రత్యగ్ర
కుసుమాలు భక్తితో కోసుకొని తెచ్చాము ॥ఆచార్య॥
రంగారు బంగారు చెంగల్వ పువులెన్నొ
దిగుడు బావుల చేరి తెచ్చాము భక్తితో ॥ఆచార్య॥

వన్నె చిన్నెలు చిందు చిన్నారి పొన్నారి
పొగడ పూవులు కోసి పూజకై తెచ్చాము ॥ఆచార్య॥

భాస్కరాచార్య

ఆ.వె॥
ఈశ్వరునకు ఏవి ఇష్టమౌ పుష్పాలు?
పూజ కెన్నదగిన పువ్వు లేవి?
ఇంద్రియార్జవమ్ము - ఏకైక పుష్పమ్ము!
భూతదయను మించు పువ్వు లేదు!

జ్ఞాన మొక్క పువ్వు - ధ్యాన మింకొక పువ్వు
తావి తరుఁగ నట్టి పూవు - ఈవి!
సత్య మనెడి పువ్వు - సర్వదా శ్రేష్ఠమ్ము
క్షమకు సాటి పువ్వు - క్షమయె సుమ్ము.

చెట్టు మీద కాక - చిత్తవృత్తులలోన
పూచినట్టి పూల పూజ లేక
దివ్య మంత్ర పుష్ప దీప ధూపాలలో
తృప్తి చెందబోడు - దేవు డెపుడు.

**(ప్రవేశం - కుసుమ శ్రేష్ఠి దంపతులు. గురు నమస్కార నాట్యం)**

భాస్కరాచార్య

ఆది తాళం రాగం

కన్యకామణీ - ధన్యము నీ జని
ధన్యులు నీ తలిదండ్రులు ధరణిని
నీవే వాణివి - నీవే లక్ష్మివి - సర్వమంగళవు శర్వాణి వీవు
ముగ్గురమ్మలకు మూలపు టమ్మవు గదమా వాసవి కన్యవు నీ వే॥

పరివేషము నీ శిరమును చుట్టుచు - క్రాంతదర్శులకు కనిపించునుగా
తొలి పలుకుల వెలుగులు తొలుకాడును వెల్లివిరిసి స్వరవిన్యాసములో.

కన్యక

గురుదేవా - నేను కుసుమాంబా కుసుమ శ్రేష్ఠి దంపతుల శారీరక పుత్రికను. భాస్కరాచార్య దేవుల మానస పుత్రికను అని పలు మారులు ప్రకటించి వల్లించుకున్నాను.

భాస్కరాచార్య

ఆ.వె॥ భూమి మీద నున్న ప్రేమానుబంధాల
స్వార్థ లేశ ముండవచ్చు కొంత;
పరమ పావనమ్ము - గురుభక్తి బ్రదుకులో
గుండె పండినట్టి గొప్ప గుర్తు.

భాస్కరాచార్య

ఆది తాళం రాగ మాలిక

శంశం భం భం శంఖారావం
పూరింపుడు ఓంకార ప్రణవం!
హ్రీం క్లీం ఐం శ్రీం మృదు ఝుంకారం!
క్వణిత కింకిణీ గణ కైంకర్యం! ॥శం శం భం భం॥

అండ పిండ బ్రహ్మాండ మండలికి
అధ్యాహారం - ఆద్యాధారం!

అనుభవ వేద్యం - అమృత రసఝురీ
సద్యోవేగోత్సవ జలపాతం! ॥శం శం భం భం॥

అంహోరహితోద్యమ హుంకారం!
బృంహిత జంత్రస్వర ఘీంకారం!
సంహృతానంద రంహోద్వేగం!
సంహితా సామ సంభృత యోగం. ॥శం శం భం భం॥

పరమహంస హృద్ ప్రజ్ఞా పారం!
సర్వోపనిషత్ సంగ్రహ సారం!
సంసార తామస గుణ సంహారం!
మానస రోచిర్మజ్జన పూరం. ॥శం శం భం భం॥

తెరలో - ఓంకార ప్రస్తారం.

తెరలో శంఖారావాలు తూర్యభేరీ పటహ ధ్వనులు

## వందిమాగధులు

శ్రీశ్రీశ్రీ స్వస్తిశ్రీమదఖండ భూమండల మండనాయమాన వేంగీ రాజ్యాఖండలా! పెనుగొండ ఇత్యాది అష్టాదశ మహానగర రాజ్యయుత శతాధిక అగ్రహార పూరిత - శతసహస్ర సరోవర సంభృత: నాగావళి వంశధారా శారదా గోదావరీ కృష్ణవేణీ పినాకినీ తామ్ర పర్ణీ నదీ పరీవాహ సీమా సంయుక్త! కన్యాకుమారీ పర్యంత ప్రాజ్య రాజ్య సామ్రాజ్య సార్వభౌమా! అపార పారావార మధ్యస్థ యవ సుమిత్రా సువర్ణ ద్వీప చీనా ద్వీప ద్వీపాంతర వర్తక వ్యాపార పారీణ! అనేక జల దుర్గ వనదుర్గ గిరిదుర్గ స్థల దుర్గ సంరక్షణ చణ: అనేక నౌకా సైనిక నవలక్ష ధనుర్ధరాధీశ! - శ్రీశ్రీశ్రీ విష్ణువర్ధన చోడ వీరేంద్ర భూపాలా! విజయీభవ! దిగ్విజయీ భవ!

(ప్రవేశం) మహారాజు-

భాస్కర గురు - కుసుమ శ్రేష్ఠి దంపతుల స్వాగత నృత్యాలు.

కన్యక + చెలికత్తెలు స్వాగత హారతి నృత్యం

తాళం రూపకం రాగం

హార్దిక మగు మా స్వాగత మిదిగో!
అరుదెంచుము సౌహార్దముతో!
స్వాగత మంగళ హారతి ఇదిగో!
హృదయంగమ నీరాజన మిదిగో. ॥హార్దిక మగు॥

పాలింపుము బిడ్డల వలె - ప్రజలను వీరేంద్రా!
నీతి గలిగి - కలిగి శీల నియమ నిరతి;
కాపాడుము ప్రజలందర - కరుణామయ హృదయముతో;
ధర్మవీర దయావీర దాక్షిణ్యముతో. ॥హార్దిక మగు॥

**కన్యక**

ఉ॥ పావన మైన దీపురము - వాణికి లక్ష్మికి - సర్వమంగళా
దేవికి సంగమ స్థలము - దివ్య మనోహర తీర్థ దీధితిన్
పావన మైన అర్ఘ్యమును పాద్యము తోడ - నదీ మతల్లి - గో
దావరి స్వాగతంబిడు - సదా - పెనుగొండకు వచ్చు వారికిన్.

**కన్యక - చెలికత్తెలు**

ఆ.వె॥ కదిపి కుదుప ఎడద - కమ్మ తెమ్మెర చాలు!
నాట్యమాడు పువ్వు నవ్వు చాలు!
కలవరించు చిన్న సెలయేటి అల చాలు
చెవుల బడెడి మురళి రవళి చాలు.

**(తెరలో వేణు నాదం - చప్పెటలు - తాళాలు)** జడ కోలాటం

ఆది తాళం రాగ మాలిక

## కన్యక - చెలికత్తెలు - జడ కోలాటం

I

ఎందుకో ఎందుకో నా డెందము
చిందులు త్రొక్కెడు - ఆనందముతో!
కన్నుల ముందర అంద చందములు
కనుపించినచో! . . . .
వీనుల విందుగ గాన రవమ్ములు
వినిపించినచో! . . . . ॥ఎందుకో॥
మందాకినిలో పొందామర పువు
చందము లొలికెడి చందమామ గని
నందన వనిలో మందహాసములు
చిందే సుందర మందారము వలె ॥ఎందుకో॥
కమ్మని అలజడి కలవరములు హృది
వెడవెడు పగిలే బుడగల వడువున ॥ఎందుకో॥

II

జల జల కొండల క్రిందికి దూకే
సెలయేరులు కనుపించినచో! ॥ఎందుకో॥
గున్నమావిపై కోకిల కుహుకుహు
కూజితములు వినిపించినచో ! ॥ఎందుకో॥
కోడె నెమలి పురి కన్నులు విప్పుచు
లయ యెడ బాయని లాస్యము లాడగ ॥ఎందుకో॥

గున్న యేనుగులు కొండల దండల
గుంపులు గుంపులు కనుపించినచో! ॥ఎందుకో॥

III

ఉదయ రవి కిరణ మృదు కాంతులలో
పొదరిండ్లపై (న) - పూవుల రేకుల
సందులలో హిమబిందువు లందున
ఇంద్ర ధనుస్సుల ఈక్షించినచో! ॥ఎందుకో॥
వర్షానది వడి వడిగా వారిధి
కౌగిలి చేరుచు కనిపించినచో! ॥ఎందుకో॥
చిటపాటి తొలకరి చినుకుల జడిలో
పిల్లల అల్లరి వినిపించినచో! ॥ఎందుకో॥
బడి కోలాటము లాడుచు వడి వడి
జడ ముడి విప్పుచు వెడలగ బాలలు ॥ఎందుకో॥

**మహారాజు**

ఓ హోహో! నాట్యము నేత్రోత్సవ మన ఇదియే
ఆహాహా! సహృదయ సద్యః పరనిర్వృతి ఇదియే:
సంగీతము నృత్య విద్య - సాహిత్యము సంగమింప
జంగమ ప్రయాగయేను- రంగస్థలి రసమయమై - ఓహోహో
చాక్షుష మగు యజ్ఞము సందర్శించినచో - నే
స్వర్గ మైన నీరసముగ సంభావించెద హృదిలో - ఓ హోహో

భాస్కరాచార్య

తాళం : ఝంపి రాగం

శ్రీరస్తు శుభమస్తు శ్రీరాజ మార్తాండ
శ్రీ రాజ వీరేంద్ర - దుష్ట శిక్షణ దండ
వర్తకులు సాధువులు వసుధైక మిత్రములు
ధర్మకర్తలు బహు దైవతాలయములకు
శాంతి భద్రతలు ఉచ్ఛ్వాస నిశ్వాసములు
ధర్మనిరతులు వీరు - దానకర్ణులు వీరు
సాహసమున రాష్ట్రాలు సరిహద్దులను దాటి
సంస్కృతి సుమపరాగ సమ్మేళనము గూర్చు
తేనెటీగలు వీరు మానవ సమాజమున
రాయబారులు వీరు ప్రభువర్తకులు వీరు

**సేనాపతి**

రాజమహేంద్రవరం - రాజకీయ రాజధానియే గాని - పెనుగొండ నగరం వేంగీ మండలానికి వాణిజ్య రాజధాని. అంతర్జాతీయ సంపదను వేంగికి తరలించి తెచ్చే పెనుగొండ వర్తక ప్రభువులకు జేజేలు. శ్రీశ్రీశ్రీ వీర రాజేంద్ర చోడ ప్రభువులు శ్రీశ్రీశ్రీ కుసుమ శ్రేష్ఠి గారి కొడుకు శ్రీ విరూపాక్ష దేవరను వేంగీ సైన్యంలో గౌరవ దండనాథునిగా నియమించుచున్నారు. మరో శుభవార్త. శ్రీశ్రీశ్రీ కుసుమ శ్రేష్ఠి దంపతుల పుత్రికా రత్నం శ్రీరస్తు చిరంజీవిని సౌభాగ్యవతి వాసవి కన్యకా మణి - సార్వభౌములు అష్టమహిషులలో ఇష్టమహిషిగ రాణివాసం చేరాలని అభిలషించుచున్నారు.

**(కుసుమ శ్రేష్ఠి వైపు తిరిగి)**

తే.గీ॥ దండనాథు డయ్యెను నీ సుతుండు నేడు
శ్రీ విరూపాక్ష దేవర శ్రేష్ఠిగారు;
రాణి యయ్యె నీ పుత్రికా రత్న మిపుడు
చేరె భాగ్యమ్ము నీ చెంత శ్రేష్ఠి వర్య.

మహారాజు (కన్యక వైపు తిరిగి)

ఆ. వె॥ వాణి వీణ వీవు - గాన వాహిని వీవు;
ప్రణయ నందన వని ప్రసవ మీవు;
నాట్య నయన మీవు - నా మనోహరి వీవు
కవిత పొంగు - అమృత కలశ మీవు.

తాళం : ఝంపి

రాగం

ఊపె నీ మాటయే - ఉయ్యాలయై నన్ను
కలల కెరటాలపై గగనాని కెగిరాను
మిన్నేటి అలలపై మెరపు తీగలపైన
తారాపథము దాటి తరలి పోతున్నాను .॥ఊపె నీ మాటయే॥

**కన్యక**

మహారాజుగారు నా విన్నపం అవధరింప ప్రార్థన

ఆ.వె॥ భాస్కర గురుదేవు భక్తితో సేవించి
బ్రహ్మచర్య దీక్ష పడసి నాను;
ఇచ్ఛ లేదు నాకు - తుచ్ఛ సౌఖ్యాలపై
ఇహము పైన - శ్రీ నరేంద్ర మౌళి!

**సేనాపతి**

ఇది రాజాజ్ఞా ధిక్కారమే. కన్యకామణీ! మరోసారి ఆలోచించుకోవాలని మా హితోపదేశం.

**మహారాజు**

గురు వరేణ్యులు పూజ్యపాదులు శ్రీ భాస్కరాచార్యుల వారి అభిప్రాయం తెలుసుకోవచ్చునా?

**భాస్కరాచార్య**

ఆ.వె॥ కలిగి నాభి యందు కస్తూరి - మృగ మేల
పచ్చ గడ్డి కొరకు పరుగు లెత్తు?
ఏల నరుడు వెడలు - ఎండమావుల వెంట?
గుండె లోన అమృత భాండ ముండి.

***(పటాటోపంగా కోపంగా మహారాజు నిష్క్రమణం)***

**సేనాపతి**

అయితే - వినండి. పెనుగొండ పౌరులారా! రాజాజ్ఞ. కన్యకకై రాణివాసపు ముత్యాల పల్లకి సిద్ధంగా ఉంది. ఆమె నిరాకరిస్తే- తక్షణం పెనుగొండ నగరం అంతా బూడిద బుగ్గిగా మారిపోతుంది. రాజాజ్ఞకు తిరుగు లేదు.

***(సేనాపతి నిష్క్రమణ)***

## కన్యక

తాళం: ఝంపి రాగమాలిక

I

ప్రాణాలు అరచేత పట్టుకొని యున్నాను
సామి ఏ క్షణములో ఏమి రానున్నదో!
అగ్ని పర్వతముపై - అల్లాడుచున్నాను;
పొగలతో సెగలతో భుగభుగలతో (నిండి)
గగన మంతయు - వేడి కారు మేఘాలతో
కనలి పోయెడి సామి - కాలి పోయెడి నేడు ॥ప్రాణాలు॥

II

కడలి నడి నీటిలో - పడవపై ఉన్నాను
తెడ్డు ఉన్నది గాని తెరచాప లేదురా
దిక్కు తోచుట లేదు దిగులుతో పగలెల్ల;
చుక్క లున్నవి రేయి - చుక్కాని లేదురా ॥ప్రాణాలు॥

III

సూర్య కిరాణాలు - లో చొరజాల లేనట్టి
చెట్టు చేమలతోడ దట్టమై యున్నట్టి
అడవి లోయలలోన - నడయాడు చున్నాను
ఏ దిక్కు చూపింతువో.... ॥ప్రాణాలు॥

IV

ఏడు మిద్దెల మేడ - ఏటిలో పడిపోయె!
వాకిళ్ళు లోగిళ్ళు వంతెనలు కూలాయి!
భూకంప శిథిలాల ఏకాంత శూన్యాన
కుత్తుక వరకు నేను కూరుకొని యున్నాను

॥ప్రాణాలు॥

V

అడవి కంటెను గూడ - కడలి కంటెను గూడ
అగ్ని పర్వత ముఖము - ఆవులింతల కంటె
భూకంపమున కంటె - పుడమిపై పెరిగేటి
సంసార బంధాలు - హింసా కబంధాలు ॥ప్రాణాలు॥

**కన్యక**

భాస్కర గురువర్యా - మీకివే నా కడసారి నమస్కారాలు

**భాస్కరాచార్య**

తల్లీ కన్యకామణీ!
కారణజన్మ నీది - కలకాలము నిల్చును నీ పవిత్ర గాథ - ఈ
ధారుణి యందు - ఇంక ధ్రువతారగ నిల్తువు నింగి మీద - సం
సార విరక్తికిన్ - సరళ సంఘ జనీనతకున్ ప్రతీక - నీ
పేరిక యావదాంధ్ర పృథివిన్ - గుడిగంటల మారు మ్రోగుతన్.

కన్యక

తాళం : ఝంపి రాగం

ధ్రువతార తోచించి - ధ్రువతార పిలిచింది!
అవతార తత్త్వమ్ము - అర్థమైనది నాకు!
అంతరిక్షము నందు - ఆదర్శ తేజస్సు
సప్తర్షి సందేశ సంకేత వర్చస్సు
నక్షత్ర గోళ సంతతులకు స్థిర శిరస్సు
జ్యోతిర్వలయ తత్వ సూచికా రోచిస్సు ॥ధ్రువతార॥

II

తోమాల మిరుమిట్లతో నన్ను పిలిచింది
పుడమి కవ్వలి వెల్గు ఎడదలో నింపింది
స్వర్గీయ మార్గమ్ము స్వాగతము పలికింది
సంగీత సామమ్ము - శ్రవణాల సోకింది. ॥ధ్రువతార॥

III

ప్రాణాలు మేలైనవా? ఆత్మ గౌరవము
మేలైనదా ప్రాణాలు మేలైనవా?
పాంచభౌతిక శక్తి పరిమితము జగతిలో!
ఆత్మశక్తికి చూడ అవధు లేవియు లేవు. ॥ధ్రువతార॥

IV

మందాకినీ తీర నందనోద్యానమ్ము
మందార మకరంద మాధురీ భరితమ్ము
కల్పవృక్షము నీడ - కామధేనువు తోడ
చింతామణీ చంద్ర కాంత శిల్పము కూడ ॥ధ్రువతార॥

**(కన్యక చితికి ఆహుతియై పోతుంది)**

భాస్కరాచార్య

తాళం : చాపు రాగం

కాలి పోయెను కన్యకామణి కాయబంధము కలియుగమ్మున
కర్మయోగిని త్యాగభూమిక కాల పరిమితి గడచి పోవుచు
తెలుగు దేశ పవిత్ర చరితకు తీరుతీయుము దిద్ది వెలుగుత
చదల సూర్యుడు చంద్రు డుండెడి వరకు కన్యా చరిత నిలుచును.

భాస్కరాచార్య

ఆ.వె॥ కాలిపోవు గాక - క్రౌర్య కౌటిల్యమ్ము,
పాశవికత ఇంక నాశ మగుత;
అణిగిపోవు గాక - అహము దౌర్జన్యమ్ము
కన్య- త్యాగ యజ్ఞ కల్పమందు.

మహారాజు ప్రవేశం

మహారాజు పశ్చాత్తాపం నా హృదయాన్ని దహించి వేస్తోంది.

ఆ.వె॥ కనులు విప్పినావు - కన్యకామణి నాకు
ధర్మమూర్తి వీవు- త్యాగమయివి;
కండ కావరమ్ము - కామ ప్రకోపమ్ము
కలిసి వీడిపోయె - గెలుపు నీది.

(రాజు నిష్క్రమణం)

తెరలో

I

ఆ.వె॥ విష్ణువర్ధనుండు - వీడెగా ప్రాణాలు
పొగిలి గుండె - శిరము పగిలి పోయి;
కవుల ప్రతిభ పెంచి - కన్యకా చరితమ్ము
కథగ మిగిలి పోవు గాక - ఇంక.

భాస్కరాచార్య

ఆ.వె॥ సాధనాలు గావు - సంతాన సంపదల్
సత్క్రియాచరణము - జ్ఞాన పటిమ;
త్యాగ మొకటె అమృత యోగ సిద్ధికి త్రోవ
సకల ధర్మ సార సంగ్రహమ్ము.

తెరలో

II

ఆ.వె॥ కనిన - వినిన - ప్రజకు కన్యకా చరితమ్ము
పుడమి కవలి వెలుగు లెడద చేరు!
అమరగలవు ఆయురారోగ్య సంపదల్;
తీరి - కోర్కు లెల్ల తృప్తి కలుగు.

అహము - రాజసమ్ము - అధికార దర్పమ్ము
శీలవతిని ఏమి చెయగలిగె?
చక్రవర్తి గూడ - సత్యాగ్రహము ముందు
శిరము వాల్చి ఓడె - సిగ్గు తోడ.

